సమాచారం

కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం స్పెక్ట్రా ఫీడర్ పరిధిలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు శనివారం ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. మౌలాలి పారిశ్రామికవాడ, న్యూశ్రీనగర్ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంటు ఉండదన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కుషాయిగూడ: మధుర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం చిన్న చర్లపల్లి ప్రైమరీ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రస్టు చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కిమ్స్ ఆస్పత్రి వారి సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ఇతర పరీక్షలతో పాటు కంటి పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. చర్లపల్లి వాసులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

నాచారం సీఐ బదిలీ

మల్లాపూర్: నాచారం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన టి.కిరణ్ కుమార్ సైబర్ క్రైమ్‌కు బదిలీపై వెళ్లారు. దాదాపు రెండు సంవత్సరాల ఏడు నెలలు నాచారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు.



కిరణ్‌కుమార్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రేరణ ప్రతిభ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణేశస్తుతి, జతిస్వరం, శివస్తుతి, మల్లికార్జున కౌతం, అన్నమాచార్య కీర్తనలు అంశాలను ప్రదర్శించి మెప్పించారు. అమీకుమార్, సంహిత, సామవేద, అన్విత, అనంది, సన్నుతి, ఉమామహేశ్వరి, శ్రీనివాస పరిణీత తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

నిత్యం ధ్యానం చేస్తే ప్రశాంతత, ఆరోగ్యం



మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ప్రపంచ శాంతి స్థాపనకు బ్రహ్మకుమారిస్ చేస్తున్న కృషి అభినందనీయమని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని బ్రహ్మకుమారిస్ ఆశ్రమంలో శనివారం నిర్వహించిన త్రిమూర్తి శివ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య ధ్యాన సాధనతో ప్రశాంతత, ఆరోగ్యం సొంతం అవుతుందన్నారు. హెచ్‌బీకాలనీ బ్రహ్మకుమారిస్ ఇన్‌చార్జి బీకే సునీత మాట్లాడుతూ పరమ శివుడి దివ్యప్రేరణతో ప్రజాపిత బ్రహ్మకుమారిస్ ఈశ్వర విశ్వవిద్యాలయాన్ని స్థాపించి 87 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం త్రిమూర్తి జెండాను ఆవిష్కరించి విశ్వశాంతి కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ బీకే రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌ను మరింత అభివృద్ధి చేస్తా

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తానని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్‌గా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మల్లాపూర్ వార్డు కార్యాలయంలో శనివారం బీఆర్‌ఎస్ నేతలు కార్పొరేటర్ ఘనంగా సత్కరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కోట్ల రూపాయలతో డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, వాసుగౌడ్, పీఆర్, ప్రవీణ్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, పద్మారెడ్డి, సానాల రవిచారి, నర్సింగ్‌రావు, నరేష్, బుసాని రఘు, రాపోలు శ్రీను, శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

అడుగడుగునా నీరాజనం



పరమేశ్వర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులకు మంగళహారతి ఇస్తున్న స్థానికులు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్ డివిజన్‌లో ఏ– బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జోడోయాత్రకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పార్టీ సీనియర్ నాయకులు బోరపేట కృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఉప్పల్ భరత్‌నగర్, న్యూ భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ముందుకు సాగారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రజాసంక్షేమాన్ని విస్మరించాయని పరమేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమ పాలన సాధ్యమన్నారు. వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనన్నారు. ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధులు మేకల శివారెడ్డి, తౌఫిక్, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, సుర్వి మురళి, తెల్కల మోహన్‌రెడ్డి, కొంపల్లి బాలరాజు, జలీల్, అమరేశ్వరి, రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రజాసమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి అధ్యక్షతన శనివారం హాత్ సే హాత్ జోడో యాత్రపై నిర్వహించిన సమీక్షకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బోడుప్పల్‌లోని అన్ని డివిజన్లలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి మార్గం చూపుతామన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హామార ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ బీబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, నేతలు కుర్రి శివశంకర్, రాపోలు శంకరయ్య, హరినాథ్‌రెడ్డి, కందుకూరు నవీన్, బాలరాజ్‌గౌడ్ ఉన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

విశ్వకర్మ మహాసభ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా బి.రాజమౌళిచారి

ఉప్పల్: అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా బి.రాజమౌళిచారి నియమితులయ్యారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ జాతీయ అధ్యక్షుడు అశ్వినికుమార్ సభాముఖంగా రాజమౌళిని ప్రకటిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశ్వినికుమార్ మాట్లాడుతూ 1968లో ప్రారంభమైన జాతీయ మహాసభ విశ్వకర్మల చైతన్యానికి, సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. విశ్వకర్మల సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కౌశల్ సమ్మాన్ పథకం ప్రకటించడపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాజమౌళి మాట్లాడుతూ విశ్వకర్మలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి, రాష్ట్ర సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తామన్నారు. విశ్వకర్మల సంక్షేమానికి ఉప్పల్ బగాయత్‌లో ఐదు ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు రూ.5 కోట్లు ప్రకటించడంపై సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జాతీయ నాయకులు చిన్మయచారి, సుభాష్ చంద్రబోస్, భాస్కరచారి, విజయమోహన్, కృష్ణ విశ్వకర్మ, అంకరాజు, మాదవ్, శ్రీనివాసచారి, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రాజమౌళిచారికి నియామక పత్రాన్ని అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు అశ్వినీ కుమార్

విద్యార్థులకు చదువు, క్రీడలు రెండూ ముఖ్యమే..



విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెంగిచెర్లలో నిర్వహించిన ఆటల పోటీల్లో విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్–14 కబడ్డీ, ఖోఖోలో ద్వితీయ స్థానం, అండర్–17 విభాగంలో కబడ్డీలో ద్వితీయ స్థానంలో నిలవగా వారికి మేయర్ జక్క వెంకట్‌రెడ్డి చేతులమీదగా ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు. విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్లు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ అయ్యంగార్, ఆకవరం సౌజన్యరెడ్డి, ప్రిన్సిపాల్ నీలిమ, పీఈటీ భాస్కర్ వారిని అభినందించారు.

మురుగు కాల్వ నిర్మాణ పనులను పూర్తి చేయండి

అల్వాల్: మురుగు నీటి కాల్వ పైపులైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అల్వాల్ డివిజన్ పరిధిలోని భారతీనగర్‌లో రూ.3.70 లక్షలతో కొనసాగుతున్న మురుగు నీటి కాల్వ నిర్మాణ పనులను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాల్వ నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు శేఖర్, అరవింద్, శ్రీనివాస్, కృష్ణ, శర్మ తదితరులు ఉన్నారు.



భారతీనగర్‌లో మురుగు కాల్వ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణంలో వేగం



తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేస్తూ..

మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ నితీష్ యాదవ్ తెలిపారు. సవేరా ఏజెన్సీస్ మేడిపల్లి డీలర్ షాప్‌లో 150 మంది తాపీ మేస్త్రీల సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సాయపడతారని తెలిపారు. ఈ సందర్భంగా 150 మంది తాపీ మేస్త్రీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ మేనేజర్ సునీల్, మార్కెటింగ్ ఆఫీసర్స్ రాజేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్స్ ప్రసాద్, సాత్విక్, సహెర్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే లక్ష్య సాధన



అక్షర పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకల్లో చైర్మన్ జగన్మోహన్‌రావు

కుషాయిగూడ: ప్రతి నిత్యం ఇష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని కుషాయిగూడ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ జగన్మోహన్‌రావు అన్నారు. శనివారం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యానికి చేరువయ్యేలా ప్రణాళికబద్ధంగా చదువులు సాగించాలన్నారు. అనంతరం 9వ తరగతి విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మదన్‌మోహన్‌రావు, ప్రిన్సిపల్ కనుప్రియవాహి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: శ్రీభ్రమరాంబ సహిత మల్లికార్జున్ స్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాసాల నర్సింగ్‌రావు వెల్లడించారు. ఆదివారం స్వామి వారికి అభిషేకం, పుట్టుకమ్మట, గంగతెప్పోత్సవం, 13వ తేదీన శ్రీభ్రమరాంబ సహిత మల్లిఖార్జున స్వామి కల్యాణ మహోత్సవం, 14వ తేదీన శ్రీరేణుకా ఎల్లమ్మ వారి కల్యాణ మహోత్సవం, బోనాలు, గొలుసు తెంపుట, అగ్ని గుండాలు తొక్కుట, ఫలహార బండి ఊరేగింపు, 18వ తేదీన మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు, 26వ తేదీన కొండ పోచమ్మ అమ్మ వారికి బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఆహ్వానం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 15న జరగనున్న సేవాలాల్ జయంతి సందర్భంగా సేవాలాల్ భోగ్ బండార్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ మంత్రి మల్లారెడ్డిని శనివారం సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ పీర్జాదిగూడ సభ్యులు ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. సుభాష్ నాయక్, సక్రు నాయక్, ప్రవీణ్ రాథోడ్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న బంజారా అసోసియేషన్ సభ్యులు

మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్‌గా బి.రవికుమార్

మల్కాజిగిరి: మల్కాజిగిరి పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.జగదీశ్వర్‌రావు బదిలీ అయ్యారు. జగదీశ్వర్‌రావు భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీకాగా ఆయన స్థానంలో రాచకొండ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న బి.రవికుమార్ బదిలీపై వచ్చారు. మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో డీఐగా, ఇన్‌స్పెక్టర్‌గా జగదీశ్వరరావు సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు.



శుభాకాంక్షలు



రామంతాపూర్: జీహెచ్‌ఎంసీ మేయర్‌గా రెండేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న గద్వాల విజయలక్ష్మిని శనివారం రామంతాపూర్ మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గంధం జ్యోత్స్న, సీనియర్ నేత గంధం నాగేశ్వర్‌రావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సత్కారం

కుషాయిగూడ: కార్పొరేటర్‌గా రెండేళ్లు పూర్తి చేసుకొని మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా శనివారం చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని రామంతాపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు ఘనంగా సత్కరించారు.



ఘనంగా కాటిపల్లి రవీందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కాటిపల్లి రవీందర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన ఉప్పల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ సీనియర్ నేత కాటిపల్లి రవీందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నాచారంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై రవీందర్‌రెడ్డి ఘనంగా సత్కారించారు. మహంకాళి దేవాలయంలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డితో కలిసి రవీందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద, మల్లాపూర్ వార్డు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీరామ్ సత్యనారయణ, టీకీ రాజశేఖర్, గద్ద యుగేంధర్, వేముల మారయ్య, సుగుణాకర్‌రావు, రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, వెంకటేశ్వరనగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఎంఎస్‌రెడ్డి లయన్స్ క్లబ్ ఐ ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పేదలకు ఉచితంగా కాట్‌రాక్ట్ ఆపరేషన్ చేయనున్నట్లు ఆసుపత్రి యజమాన్యం తెలిపింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనను ఘనంగా సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ట్రస్టు అధ్యక్షుడు బేతి పాండు, సెక్రటరీ వసంతరావు, వీరభద్రరావు, శ్రీపతి, రాజారావు, నాదం చారి, మాలాద్రి, రమాదేవి, నాగయ్య, విఠల్, జలగం వెంకటేష్ , మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం

కృష్ణానగర్ కాలనీలోని పోచమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, సుధాకర్ గుప్త, మల్లారెడ్డి, అంజయ్య, బాలరాజుగౌడ్, సాయన్న, చారి, బాలయ్య, కృష్ణవేణి, సుజాత, అనిత, రోజా శేఖర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి

కాలనీ సంఘాల సహకారంతో నేరాలకు చెక్

మల్కాజిగిరి: నేరాలను అదుపు చేయడంలో కాలనీ సంఘాల పాత్ర కీలకమని మల్కాజిగిరి జోన్ డీసీపీ జానకి ధరావత్ అన్నారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ జవహర్‌నగర్ కాలనీలో కాలనీ అసోషియేషన్ ఆధ్వర్యంలో రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన 42 సీసీ కెమెరాలను ఆమె ఏసీపీ నరేష్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరస్తులు పోలీసులకు సవాళ్లు విసురుతూ కొత్త విధానాలు పాటిస్తున్నారన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సైబర్ నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కాలనీల్లో దొంగతనాలు, నేరాలను అదుపులో ఉంచాలంటే సీసీ కెమెరాలు కీలకమన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు సీసీ కెమెరాల ఏర్పాటులో స్వచ్ఛందంగా ముందుకు రావడం హర్షణీయం అన్నారు. కాలనీ వారికే కాకుండా సమాజానికి మేలు చేసిన వారవుతారని చెప్పారు. ఎస్‌ఐ హరిప్రసాద్, సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ జానకి